సెటైర్

# త్రిలకాష్ఠ మహిష బంధనం

కె. విజయభాస్కరరావు

ఏ మహా యోధుడు 'సికత యిసుమున తైలంబు' తీయగలనన్నాడో! ఏ జితేంద్రియుడు 'మృగతృష్ణలో నీరు' త్రాగగల నన్నాడో! ఏ మాంత్రికుడు 'కుందేటి కొమ్ము' సాధింపగల నన్నాడో! ఆ మహానుభావుడే ఈనాడు ఆంధ్ర రాష్ట్రంలో ఆరోగ్యంగా జీవించివుంటే, పదకొండు జిల్లాలు పర్యటన చేస్తే, కనీసం కర్నూలు అసెంబ్లీలో జరిగిన కథనం కనిగాని, వినిగానివుంటే రాజకీయాలు యీ రూపంగా వుంటాయనిగాని, ఈ రూపంతో అంతమౌతాయనిగాని చెప్పడానికి మాత్రం సాహసించేవాడు కాదని సందేహం లేకుండా చెప్పవలసి వస్తోంది. ఆంధ్ర మంత్రివర్గంపై విశ్వాసం లేదంటూ ప్రతిపక్ష నాయకు లేనాడు నోటీసు లిచ్చారో ఆనాటినుండీ రాజకీయ దుమారం రేకెత్తింది.

రాజకీయాలంటే ఆసక్తి లేకపోవడం వల్ల ఆంధ్ర రాజకీయాలను తరచి చూచేటంత ప్రయత్నం నేను చేయలేదిదివరలో. కాని ఇప్పుడు నేను ఉంటున్న పరిస్థితులు మారాయ్. క్లాసులోనుంచి రూములో కడుగు పెడుతానో లేదో (అసెంబ్లీ సమావేశం దగ్గర కొస్తోందనో, బలాబలాలు తేలి పోవాలీ దెబ్బతోననో, ఓడలను బండ్లను చేసే సమావేశ మిదనో తీవ్రమైన చర్చలో మునిగుండే వారు సోదరులు. రోజుకురోజు గడచినకొద్దీ చర్చ తీవ్రమౌతున్నదిగాని తగ్గుముఖం పట్టే సూచన కన్పించలేదు. 'తినగ తినగ వేము తీయనుండు' అన్నట్లు ఆ చర్చల్లో మనం కూడా ఓ పాత్ర నిర్వహించాలన్న ఆసక్తి అధికమైంది. కాని యెలా పాల్గొనాలో పాలుపోవడం లేదు. రెండు దశాబ్దాలు నా కళ్ళముందుగా పోయినా జీవిత రంగంలో రాజకీయ రంగపు పొర్లనేమీ చదువ లేక పోయానే అనే బాధ కల్గింది. రాష్ట్రపతి, నెహ్రూలాంటివాళ్లు 'ఈనాటి యువకులే భావి భారత నిర్మాతలని పదేపదే చెప్పే ప్రసంగాలలో పరమార్థం నాలో పౌరుషాన్ని రేకెత్తించింది.

ఏ విషయాన్నాధారంగా చేసుకొని ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విశ్వాసరాహిత్య తీర్మానాన్ని ప్రవేశ పెట్టబోతున్నాయి? వెంటనే అడిగాను ప్రక్క నున్న స్నేహితుల్ని. రమణ ప్రారంభించాడు. "మద్యపానంపై రామమూర్తి కమిటీ సూచించిన అంశాలను ప్రభుత్వం అమలులో పెట్టక ఏ కమిటీ నైతే తాను నిర్మించిందో ఆ కమిటీ తీర్పునే త్రోసివేసిందంటే ప్రభుత్వముపై అవిశ్వాసతీర్మానం తేవాలా? అమానుష చర్యలు చేయాలా?..." అంటూ ఏదో తీవ్రంగా చెప్పబోతున్నాడు.

"గాంధీజీ ఏర్పరచిన కాంగ్రెసు మూల సూత్రాలలో ముఖ్యమైన వాటిల్లో మద్యపాన నిషేధం ముఖ్యమైనప్పుడు ప్రభుత్వమే తన చేతితో ఎలా అమలు జరుపుతుందోయ్! ఐనా సంజీవరెడ్డి రామమూర్తి కమిటీ ఇంత పాపం చేస్తుందను కొన్నాడా" అంటూ సుబ్బారావు రమణకు సమాధానం చెబుతూ నావైపొకసారి చూశాడు.

సంజీవరెడ్డనేసరికి నాకు పూర్వమున్న కొన్ని సందేహాలు తీర్చుకోవాలనిపించింది. రెడ్డిగారు రాజకీయ రంగంలో సంజయుడంతటివాడటగా! ఆయన పట్టింది బంగారమౌతుందట నిజమేనా? తాను తల్చుకొన్నది అయ్యేవరకు తనివినొందని మాట వాస్తవమే! అంటూ యిద్దరివైపు చూశాను ఎవ రెట్టి సమాధానమిస్తారోనని. సుబ్బారావు సిద్ధమౌ తుండగానే రమణ ఉపక్రమించాడు. "అవునవును! ఎంతటి అదృష్టవంతుడు కాకపోతే ఉపముఖ్య బిరుదాంకితుడై రాష్ట్రాల చరిత్రనే మారుస్తాడు! ఎంతటి కార్యశూరుడు కాకపోతే ప్రజలూ పత్రికలూ ఏక కంఠంతో రాష్ట్రాన్ని కన్నివిధాలా అనువైనచోట రాజధానిని స్థాపించమంటే, కాదని 'కర్నూలు' కాపిటల్ కావిస్తాడు! ప్రాంతీయాభిమానాలు మరింత ప్రజ్వరిల్లేటందుకు ప్రముఖుల మాటలకు విముఖుడై మరొక యూనివర్శిటీని తిరుపతిలో నెలకొల్పి పరపతికోసం ప్రాకులాడుతాడు! ఆవేశంతో ఇంకేవేవో చెప్పబోతున్నాడు. ఈ

ఆవేశంలో అడ్డుపడకపోతే ఆగదన్న భయమేసింది. రాజకీయపుటావేశాలు అప్పుడే కొత్త రుచిచూపించాడనుకొన్నాను.

ఐనదానికంత వుద్రేకమెందుకుగాని ఈ పరిస్థితిలో ప్రభుత్వం పట్టుకోగలదా? అన్నాను.

ఒకమాట చెబుతా విను బ్రదర్! అంటూ భుజం తట్టాడు సుబ్బారావు. "సంజీవరెడ్డిగారు నిజంగా అదృష్టవంతులు. ఎటువంటి క్లిష్ట పరిస్థితులైనా ఆయన ముఖం చూడగానే తప్పుకుంటాయి. అందుకే ఆయన ఆలోచించి ఒక విషయం చెప్పాడంటే తప్పక జరిగితీరుతుంది. ఆపైన కళా వెంకటరావు వెన్నెముకలాంటివాడాయనకు. వారిద్దరూ కలిసి చేయలేని పనంటూ వుండదు. కనీసం మూడు, నాలుగు ఓట్ల మెజారిటీనైనా గెలుస్తామనే ధైర్యం లేకపోతే ఆయనంత తాపీగా మాట్లాడడు. ఎంత ధైర్యం లేకపోతే అవిశ్వాస తీర్మానాన్ని ధైర్యంగా ఎదుర్కొంటాననగల్గుతారు రెడ్డిగారు?

తేలిపోతుందిగా సాయంత్రంతో బడాయ్! మనమొద్దన్నా రేడియో చెప్పక మానదులే! సిగరెట్ పొగను జోరుగావదులుతూ లేనాడు రమణ. వీళ్ళిద్దరి వాదనతో మరింత ఆదుర్దా ఎక్కువైంది నాలో. ప్రభుత్వ, ప్రతిపక్షాల బలాబలాలు చూడాలన్న బుద్ధిబలం నాలో మరింత బలమైంది.

ఇంకా ఎండ పూర్తిగా తగ్గలేదు. నాలో ఆదుర్దా ఎక్కువౌతున్నకొద్దీ సూర్యుడు మొండి పట్టుపట్టాడా అనిపిస్తోంది. కాఫీత్రాగిరావడంతో మరికొంతకాలం గడిపాను. ఐనా వార్తల టైం వరకూ రూమ్‌లో వుండలేక స్నేహితులిద్దర్నీ తీసికొని అలా షికారుకు బయలుదేరాను. మా యోధులిద్దరూమాత్రం ప్రభుత్వ, ప్రతిపక్షాల ప్రతినిధులవలె ప్రతిధ్వనించేటట్లు వాదిస్తున్నారు. రాజకీయాలలో వాదించేటంత సామగ్రి మనదగ్గరలేదని చెప్పానుగా! అందువల్ల మౌనంగా వాళ్ళవెంట నడుస్తున్నాను.

మాటల ధోరణిలో తోటలవరకుపోయి తిరుగుముఖం పట్టాం. రమణమాత్రం టైంచూసి ఐదు నిముషా లుందన్నాడు. వాయువేగ మనో వేగాలతో మునిసిపాలిటీ రేడియోదగ్గరకు చేరుకున్నాం. "ఆలిండియా రేడియోవార్తలు, చదువుచున్నది." ప్రారంభించాడు. రమణగుండెల్లో రైళ్ళు పరుగెత్తుతున్నాయి. సువార్త వినగలమా అన్న భయంతో చూస్తున్నాడు సుబ్బారావు.

"ఒక్కఓటు తేడాతో ఆంధ్రప్రభుత్వంపై ప్రతిపక్షాల విజయ పరంపర" అన్నమాటలు ముగ్గురు చెవుల్లోనూ దూరాయి. రమణని పట్టుకోలేకపోయాను. సుబ్బారావు తెలియకుండానే కూర్చొబడ్డాడు. నాలో వెనుకటి ఆదుర్దాతీరిందిగాని చెప్పదగ్గ మార్పురాలేదు.

ఒకేఓటు అనేసరికి నాకూ ఆశ్చర్యంవేసింది. ఆంధ్రరాష్ట్రంలో 403 రోజులనుండి మంత్రులనిపించుకొంటున్నవారిని ఒక్కఓటు ఆ పదవులకు రాజీనామా ఇప్పించేదే! ఒక్కఓటు ప్రభుత్వాన్నే తారుమారు చేసిందే! 86 సంవత్సరాల వయస్సుతో ముఖ్యమంత్రి పదవిని నిర్వహిస్తున్న ప్రకాశంగారిలో ప్రకాశాన్ని పాడుచేసిందే! అందుచేతే ఓట్లవిలువ కోట్లన్నారు! అని నాలో నేను పెనుగులాడుకో సాగాను.

"రెడ్డిగారు సాధించ దలచుకొన్న పనులన్నీ పూర్తవకముందే ఒకానొక్కఓటు ఎంత ఆటంకం తెచ్చిందోయ్! ఒకేఓటు ప్రభుత్వాల పతనానికి కారణమైతే మంత్రుల కెంతబాధో ముఖ్యంగా రెడ్డిగారు గ్రహించి వుంటారు" అని వూరుకున్నాడు రమణ.

నాకు కూడా ఏదో ఒక రిమార్కు పాస్ చేద్దామనిపించింది. రాజకీయంగా అంత ఓపిక లేదుగా మరి! ఒకే మార్కులో పరీక్ష పోతే విద్యార్థి బాధపడతాడో పట్టాభిరామారావుగారు పూర్వమే గ్రహించారు. కష్టసుఖాలు తెలిసిన మనిషిగాబట్టి ఎస్. ఎస్. ఎల్. సి. సప్లమెంటరీ లిస్టొకటి ఈ యేడు ప్రకటించాడాయన అన్నాను.

"గవర్నరు త్రివేదిగారు సామాన్యులా! ప్రతిపక్షాలను తేలికగా పదవిలోనికి రానిస్తాడా! మరికొంత కాలం సంజీవరెడ్డి ప్రభుత్వాన్నే సారథ్యం వహించమనడం!" సుబ్బారావు బయలుదేరాడు. ఇప్పట్లో ప్రతిపక్షాల భయము లేదన్నట్లు.

ఆ మాటలలోని అర్థం అర్థంగాక రాజకీయాలు మన కర్థమయ్యేవి కావేమోననుకొంటూ వాళ్లతోపాటు రూముకు బయలుదేరాను. కాని ఒక వోటు తెచ్చిన చేటుమాత్రం నాకేవో ఊహాలు రేకెత్తిస్తూనే వుంది.

★